శనివారం 20-7-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 399, పేజీలు: 4 | ₹6

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

EPAPER.MUNDADUGU.COM



మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com


## బిల్కిస్ బానో దోషుల పిటిషన్ కొట్టివేత

- పిటిషన్ నిరాకరించిన సుప్రీంకోర్టు
- మధ్యంతర బెయిల్ కోసం నిందితులు దరఖాస్తు



ముందడుగు ఢిల్లీ:
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో కేసులో ఇద్దరు దోషులు రెమిషన్(శిక్ష తగ్గింపు) వచ్చేవరకు తమకు బెయిల్ మంజూరుచేయాల్సిందిగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దోషుల పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం కొట్టివేసింది. న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం దీనిని పూర్తిగా తప్పుడు పిటిషన్‌గా పేర్కొంది. కోర్టులోని ఒక బెంచ్ జారీ చేసిన ఆర్డర్‌పై మరొక బెంచ్ ఎలా అప్పీల్ చేస్తారని ప్రశ్నించింది. కాగా దోషులు రాధేశైమ్ భగవాన్‌దాస్ షా, రాజుభాయ్ బాబూలాల్ సోనీ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతి కోరగా దానికి బెంచ్ అనుమతించింది. షా మధ్యంతర బెయిల్ మిగతా 2లో



## సొంత గ్రామాల్లో విద్యార్థులు చదువుకోవాలి

### స్కూళ్లపై నిర్వహించిన సమీక్షలో రేవంత్ రెడ్డి

ముందడుగు తెలంగాణ:
తెలంగాణ రాష్ట్రంలో వచ్చే మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలలను మరింత పటిష్ఠం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సెమీ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సొంత గ్రామాల్లోనే విద్యార్థులు చదువుకునేలా వీలు కల్పించాలని తెలిపారు. అంగన్‌వాడీ ప్లేస్కూళ్ల తరహాలో మూడో తరగతి వరకు విద్యాబోధనకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అంగన్‌వాడీల్లో విద్యాబోధనకు అదనంగా మరో టీచర్‌ను నియమించాలని కోరారు. నాలుగో తరగతి నుంచి సెమీ రెసిడెన్షియల్ మిగతా 2లో

## కిడ్నీలు విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టు

### ఐదు రాష్ట్రాల్లో పలువురు నిందితులు అరెస్ట్



ముందడుగు ఢిల్లీ:
దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా కిడ్నీలు విక్రయిస్తున్న ముఠా గుట్టును పోలీసులు ఛేదించారు. అయిదు రాష్ట్రాల్లో దాడులు జరిపి ఈ రాకెట్‌తో సంబంధం ఉన్న పలువురు నిందితులను అరెస్టు చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన వారి కిడ్నీలను సేకరించి అవయవాలు మిగతా 2లో

## ప్రాంతీయ పార్టీల ఆదాయాల్లో బిఆర్ఎస్‌దే అగ్రస్థానం

- రెండో స్థానంలో నిలిచిన తృణమూల్ కాంగ్రెస్
- 2022-23లో బిఆర్ఎస్ పార్టీ ఆదాయం రూ.737.67 కోట్లు



ముందడుగు జాతీయం:
దేశంలోని ప్రాంతీయ పార్టీల ఆదాయ, ఖర్చులపై అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ తాజా నివేదిక విడుదల చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో బిఆర్ఎస్ పార్టీకి రూ.737.67 కోట్ల ఆదాయం వచ్చినట్లు వెల్లడించింది. ప్రాంతీయ మిగతా 2లో



తెలంగాణలో గ్రూప్-2 పరీక్ష వాయిదా

మిగతా 2లో



మద్యానికి బానిసై తల్లితో అసభ్య ప్రవర్తన

మిగతా 3లో



దేశంలో ఇవే టాప్ 10 మ్యూజియంలు

మిగతా 4లో



కేవలం 21 రోజుల్లో బరువు తగ్గిన మాధవన్

మిగతా 5లో

ముందడుగు
శనివారం, 20-7-2024, హైదరాబాద్

# బిల్కిస్ బానో దోషుల పిటిషన్ కొట్టివేత

(మొదటిపేజీ తరువాయి)
కోసం కూడా దరఖాస్తు చేసుకున్నారు. 2002లో గోద్రా రైలు దహనకాండ అనంతరం గుజరాత్‌లో పెద్దఎత్తున చోటుచేసుకున్న మతపరమైన అల్లర్లలో బిల్కిస్ బానో కుటుంబానికి చెందిన ఏడుగురు సభ్యులు హత్యకు గురయ్యారు. 5 నెలల గర్భిణిగా ఉన్న బానోపై దుండగులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ కేసులో 11 మంది నిందితులకు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం 2008లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. 14 ఏళ్లుగా శిక్ష అనుభవిస్తున్నవారికి 2022లో గుజరాత్ ప్రభుత్వం రెమిషన్ మంజూరు చేసింది.

దీంతో 2022 ఆగస్టు 15న వారంతా జైలు నుంచి విడుదలయ్యారు. దీంతో గుజరాత్ ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బానో సుప్రీం తలుపుతట్టారు. గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తప్పపడుతూ.. వారి విడుదల చెల్లదని జనవరి 8న సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. రెండు వారాల్లోగా జైలు అధికారుల వద్ద లొంగిపోవాలని ఆదేశించింది.

# ట్రైనీ ఐఎఎస్ పూజా ఖేడ్కర్‌పై కేసు

## ఇక ముందు సివిల్స్ రాయకుండా డిబార్ ▪ ఐఏఎస్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేసిన యూపీఎస్సీ



ముందడుగు జాతీయం:
ట్రైనీ ఐఎఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్‌పై యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కేసు నమోదు చేసింది. సివిల్ సర్వీసెస్ పరీక్షల నుంచి ఆమె అభ్యర్థిత్వాన్ని రద్దు చేసేలా చర్యలు తీసుకుంది. ఇక ముందు ఆమె సివిల్స్ రాయకుండా డిబార్ చేయాలని ఆదేశించింది. ఆమెకు షోకాజ్ నోటీసులను సైతం అందజేసింది. ప్రొబేషన్ పీరియడ్‌లో ఉన్నప్పుడు అత్యంత ఖరీదైన ఆడి కార్ కోసం డిమాండ్ చేయడం, నిబంధనలకు విరుద్ధంగా దానికి రెడ్ సిగ్నల్ బల్బను ఏర్పాటు చేయాలంటూ పట్టుబట్టటం వంటి కారణాలతో కొద్దిరోజులుగా ఆమె వార్తల్లో నిలుస్తోన్నారు. తాజాగా సివిల్స్ పరీక్షల్లో కూడా ఫోర్జరీ చేసినట్లు విచారణలో తేలింది. తల్లిదండ్రుల పేర్లు, ఫొటోగ్రాఫ్, సంతకం, ఇమెయిల్ ఐడీ, మొబైల్ నంబర్, అడ్రస్ వంటి గుర్తింపును మానిప్యులేట్ చేసినట్లు యూపీఎస్సీ గుర్తించింది. ఆమెపై క్రిమినల్ ప్రాసిక్యూషన్‌తో సహా పలు చర్యలను చేపట్టినట్లు వెల్లడించింది. పూజా ఖేడ్కర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ కోరింది. పూజా ఖేడ్కర్ విషయంలో రాజీ పడదలచుకోలేదని, రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన అధికారాలకు కట్టుబడి ఉన్నామని యూపీఎస్సీ తెలిపింది.



# కిడ్నీలు విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టు

(మొదటిపేజీ తరువాయి)
అవసరమైన వారికి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. బంగ్లాదేశ్‌కు చెందిన కొంతమంది అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే పక్కా సమాచారంతో దాడులు చేసిన పోలీసులు.. ఢిల్లీలోని జసోలా విహార్‌లో రస్సెల్, రోకాన్, సుమోన్ మియాన్, రతేష్ అనే వ్యక్తుల్ని అరెస్టు చేశారు.
హరియాణా, పంజాబ్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఢిల్లీలో దాడులు చేసి మొత్తంగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ముఠా నుంచి ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లు, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలో ముగ్గురు బంగ్లాదేశ్‌కు చెందిన వారు ఉన్నారు. అరెస్టైన వారిలో నొయిడా ఆస్పత్రిలో అక్రమంగా ఆపరేషన్లు చేసి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ విజయ కుమారి ఉన్నారు. ఒక్కో ఆపరేషన్‌కు ఆమె రూ.2 నుంచి 3లక్షలు వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠా ప్రధానంగా బంగ్లాదేశ్‌కు చెందిన వారి కిడ్నీలను రూ.4 నుంచి 5 లక్షలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కొన్ని సార్లు ఉద్యోగాలు కూడా ఇప్పిస్తామంటూ నిరుద్యోగులకు ఎర వేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.



# సొంత గ్రామాల్లో విద్యార్థులు చదువుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)
స్కూల్ లో చదువుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లకు ప్రభుత్వమే రవాణా సదుపాయం కల్పించాలి. విద్యావేత్తల అభిప్రాయాలు తీసుకున్నాక ఒకట్రెండు మండలాల్లో పైలట్ ప్రాజెక్టు చేపట్టాలి. ప్రభుత్వ, సీఎస్ఆర్ నిధులతో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# తెలంగాణలో గ్రూప్-2 పరీక్ష వాయిదా

## అధికారికంగా ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం




ముందడుగు తెలంగాణ:
తెలంగాణ ప్రభుత్వం గ్రూప్ - 2 పరీక్ష డిసెంబరుకు వాయిదా వేస్తున్నట్లు ప్రభుత్వం శుక్రవారం మధ్యాహ్నం అధికారికంగా ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఆగస్ట్ 7, 8 తేదీల్లో పరీక్ష జరగాల్సి ఉంది. అయితే, డీఎస్సీ పరీక్షల క్రమంలో గ్రూప్ - 2 వాయిదా వేయాలని నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. తమకు ప్రిపరేషన్‌కు సమయం లేదని వాదించారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడ్డ పరీక్షను ఎలాగైనా నిర్వహించాలని ప్రభుత్వం తొలుత భావించింది. అయితే, నిరుద్యోగుల ఆందోళనల ఉద్ధృతం కావడంతో ప్రభుత్వంపై వాయిదాపై సానుకూలంగా స్పందించి ఉత్తర్వులు జారీ చేసింది. 783 గ్రూప్ - 2 పోస్టుల భర్తీకి టీఎస్పీఎస్సీ 2022, డిసెంబర్లో నోటిఫికేషన్ విడుదల చేయగా.. 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. డీఎస్సీ, గ్రూప్ - 2 వెనువెంటనే ఉండడంతో పరీక్ష వాయిదా వేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. గత కొంతకాలంగా ఆందోళనలు సైతం నిర్వహించారు. పరీక్ష వాయిదాతో పాటు పోస్టుల సంఖ్య కూడా పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పలు కారణాలతో వాయిదా పడ్డ పరీక్ష తాజాగా.. మరోసారి వాయిదా పడింది. డిసెంబరులో పరీక్ష నిర్వహించే తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు.

# ప్రాంతీయ పార్టీల ఆదాయాల్లో బీఆర్ఎస్‌దే అగ్రస్థానం

(మొదటిపేజీ తరువాయి)
పార్టీల్లో బీఆర్ఎస్ అగ్రస్థానంలో ఉందని తెలిపింది. దేశంలోని ప్రాంతీయ రాజకీయ పార్టీల ఆర్థిక స్థితిని విశ్లేషించిన ఏడీఆర్.. 57 ప్రాంతీయ పార్టీలకు గాను 39 పార్టీల ఆర్థిక స్థితిగతులను అంచనా వేసింది. ఆదాయంలో బీఆర్ఎస్ తర్వాత రెండోస్థానంలో తృణమూల్ కాంగ్రెస్ నిలిచింది. టీఎంసీకి రూ.333.45 కోట్లు రాగా, డీఎంకేకు రూ.124.35 కోట్లు వచ్చినట్లు ఏడీఆర్ వెల్లడించింది. మొత్తంగా 39 ప్రాంతీయ పార్టీలకు రూ.1740.48 కోట్లు సమకూరగా.. వాటిలో ఐదు పార్టీలకే రూ.1541.32కోట్లు వచ్చినట్లు తెలిపింది. మొత్తం ఆదాయంలో 88.56శాతం వీటికే రావడం గమనార్హం. ఆదాయంలో బీఆర్ఎస్ తర్వాత రెండోస్థానంలో తృణమూల్ కాంగ్రెస్ నిలిచింది. టీఎంసీకి రూ.333.45 కోట్లు రాగా, డీఎంకేకు రూ.124.35 కోట్లు వచ్చినట్లు ఏడీఆర్ వెల్లడించింది. మొత్తంగా 39 ప్రాంతీయ పార్టీలకు రూ.1740.48 కోట్లు సమకూరగా.. వాటిలో ఐదు పార్టీలకే రూ.1541.32కోట్లు వచ్చినట్లు తెలిపింది. మొత్తం ఆదాయంలో 88.56శాతం వీటికే రావడం గమనార్హం

ముందడుగు
శనివారం, 20-7-2024, హైదరాబాద్

# మద్యానికి బానిసై తల్లితో అసభ్య ప్రవర్తన

## భరించలేక కొడుకును చంపిన తల్లి



ముందడుగు క్రైం:
మనిషి కాదు పశువు కంటే హీనంగా ప్రవర్తించాడు. మద్యం మత్తులో కన్న తల్లితోనే అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ తల్లి భరించలేకపోయింది. ఎప్పటికైనా ప్రమాదమే అని భావించి.. కన్న కొడుకునే అంతమొందించింది. రెండుళ్లుగా కొడుకుతో వేగలేకపోతున్నానని.. మానసిక క్షోభను అనుభవించినట్లు ఆ తల్లి వాపోయింది. ఇక అతడి తీరు మారదని భావించి.. పచ్చడి బండతో కొట్టి చంపినట్లు పోలీసులు దర్యాప్తులో అంగీకరించింది. కేసుకు సంబంధించిన వివరాలను కృష్ణా జిల్లా పమిడిముక్కల పోలీసులు గురువారం వెల్లడించారు.

తాడంకికి చెందిన గండికోట పద్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు రాంబాబుకు ఇంకా పెళ్లి కాలేదు. కూలి పనులకు వెళ్తుంటాడు. అతడు కొంతకాలానికి మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో... తల్లితో కూడా తప్పగా ప్రవర్తించేవాడు. ఈ నెల 16న రాత్రి ఇంటికి వచ్చి లిక్కర్ సేవించాడు. ఆ మత్తులో తల్లితో తప్పగా ప్రవర్తించగా.. ఆమె భయంతో ఆమె బయటకు వెళ్లిపోయింది. కొడుకుతో ఎప్పటికైనా ఈ ముప్పు ఉందని భావించిన ఆమె రాత్రి రెండు గంటల సమయంలో తిరిగొచ్చి మత్తులో మంచంపై పడుకుని ఉన్న కొడుకుని పచ్చడి బండతో తలపై బలంగా కొట్టి హతమార్చింది. అయితే పోలీసులను తప్పదారి పట్టించేందుకు పద్మ నవారుతాడుతో కాళ్లు, చేతులు కట్టేసుకొని... కొడుకుని ఎవరో హత్య చేసినట్లు కట్టుకథ అల్లింది. ఆ తర్వాత పోలీసులు దర్యాప్తులో నేరాన్ని అంగీకరించింది. హత్యకు ఉపయోగించిన పచ్చడి బండ స్వాధీనం చేసుకొని.. నిందితురాలిని అరెస్టు చేశారు పోలీసులు. 24 గంటల్లో హత్య కేసు ఛేదించినందుకు పమిడిముక్కల పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు.



# ప్రత్యేక రాష్ట్రం కోసం గిరిజనులు డిమాండ్

## భిల్ ప్రదేశ్‌ను ఏర్పాటు చేయాలని ఆందోళన

ముందడుగు రాజస్థాన్:
మాకు ప్రత్యేక రాష్ట్రం కావాలని రాజస్థాన్ గిరిజనులు మరోసారి ఆందోళన బాట పట్టారు. రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్‌లోని 49 జిల్లాలతో 'భిల్ ప్రదేశ్'ను ఏర్పాటు చేయాలని కోరారు. రాజస్థాన్‌లో ఉన్న పాత 33 జిల్లాల్లో 12 జిల్లాలు కొత్త రాష్ట్రంలో చేర్చాలన్నారు. భిల్ సొసైటీకి చెందిన ఆదివాసి పరివార్ సహా 35 సంస్థల ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పండిట్‌ల ఆదేశాలు ఎంతమాత్రం పాటించవద్దని ఆదివాసీ పరివార్ సంస్థ వ్యవస్థాపక సభ్యురాలు మనేక దామోర్ గిరిజన మహిళలకు పిలుపునిచ్చారు. 'గిరిజన కుటుంబాలు సిందూరం పెట్టుకోవద్దు, మంగళ సూత్రం ధరించ వద్దు. గిరిజన మహిళలు, బాలికలు విద్యపై దృష్టి సారించండి. ప్రతి ఒక్కరూ ఇక నుంచి ఉపవాసాలు మానండి. మనం హిందువులం కాదు' అని ఆమె అన్నారు. ప్రత్యేక రాష్ట్రం డిమాండ్‌ను తమ పార్టీ ఎప్పటి నుంచో దీనిని చేస్తున్నదని భారత్ ఆదివాసీ పార్టీ ఎంపీ రాజ్‌కుమార్ రోట్ తెలిపారు.

# పిల్లల అల్లరి మాన్పించేందుకు తండ్రి ఉరి డ్రామా..

## తాడు బిగుసుకుపోయి మరణించిన వ్యక్తి



ముందడుగు వైజాగ్:
పిల్లలు అల్లరి చేస్తుంటారు.. వారి అల్లరి తగ్గించేందుకు తల్లిదండ్రులు వివిధ ఉపాయాలు పన్నుతుంటారు. అలాంటిది ఒక తండ్రి తన పిల్లల అల్లరి మాన్పించడానికి చేసిన ప్రయత్నం చివరికి అతని ప్రాణాలను బలితీసుకుంది. ఏపీలోని వైజాగ్‌లో బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బిహార్‌కు చెందిన చందన్ కుమార్ (33) ఇండియన్ రైల్వేస్‌లో సీనియర్ అసిస్టెంట్ లోకో పైలట్‌గా పనిచేస్తున్నాడు. ఐదేళ్లుగా వైజాగ్‌లోని కొత్తపాలెంలో నివాసం ఉంటున్నాడు. చందన్‌కు ఒక కూతురు (7), కొడుకు (5) ఉన్నారు. ఇటీవల వీళ్ల అల్లరి ఎక్కువయ్యింది. వాళ్లను ఏమైనా గట్టిగా ఒక మాట అంటే.. భార్య కూడా పిల్లలకే వత్తాసు పలుకుతుంది. తాజాగా బుధవారం రాత్రి కూడా ఇలాగే జరిగింది. చందన్ జేబులో నుంచి కరెన్సీ నోట్లను తీసుకున్న ఇద్దరు పిల్లలు వాటిని చించేశారు. అది చూసిన చందన్ వారిని మందలించాడు. కోప్పడుతున్న చందన్‌ను చూసి భార్య అడ్డుపడింది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఆ గొడవ తర్వాత తనకు ఇంట్లో ప్రశాంతత లేకుండా చేస్తున్నారని.. ఇలాగే చేస్తే ఆత్మహత్య చేసుకుంటానని చందన్ బెదిరించాడు. కానీ చందన్ మాటలను భార్యాపిల్లలు పట్టించుకోలేదు. దీంతో ఫ్యాన్ హుక్‌కు చీరకట్టి దాన్ని మెడకు చుట్టుకుని వాళ్లను భయపెట్టించేందుకు ప్రయత్నించాడు. కానీ ప్రమాదవశాత్తూ చీర మెడకు బిగుసుకుపోయింది. తమను బెదిరించేందుకు చందన్ అలా చేస్తున్నాడని అతని భార్య అనుకుని చాలాసేపటి దాకా పట్టించుకోలేదు. అయితే ఎంతసేపటికీ ఉలుకుపలుకు లేకుండా అలాగే ఉండిపోయేసరికి అనుమానం వచ్చి దగ్గరికి వెళ్లి చూసి చీరను విప్పేసింది. కానీ అప్పటికే ఉరిపడటంతో తీవ్ర అస్వస్థతకు గురై చందన్ కన్నుమూశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. చందన్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# భారత్‌లో ముస్లింలను ఉండనివ్వడం పెద్ద తప్పు

## కేంద్ర మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు



ముందడుగు జాతీయం:
భారతదేశంలో ముస్లింలను ఉండనివ్వడం పెద్ద తప్పు అని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ముస్లింలను ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'దేశ విభజన జరిగాక.. ముస్లింలను భారత్‌లో ఉండనివ్వటం పెద్ద తప్పు' అంటూ వ్యాఖ్యానించారు. '1947లోనే ముస్లింలందర్నీ పాకిస్థాన్‌కు పంపినట్టయితే, భారతదేశం మరోలా ఉండేది. అలా జరగకపోవటం దేశానికి దురదృష్టకరంగా మారింది. ఈ దేశంలో ముస్లింలను ఉండనివ్వటం పెద్ద తప్పు' అని అన్నారు. ఆయన వ్యాఖ్యల్ని ఆర్ఎస్ఎస్ మ్యాగజైన్ 'పాంచజన్య' సోషల్ మీడియా 'ఎక్స్'లో షేర్‌చేసింది.

ముందడుగు
శనివారం, 20-7-2024, హైదరాబాద్







# దేశంలో ఇవే టాప్ 10 మ్యూజియంలు

## జీవితంలో ఒక్కసారైనా సందర్శించాల్సినవి

ముందడుగు ప్రత్యేకం:

దేశ రాజధాని న్యూఢిల్లీ నడిబొడ్డున ఉన్న నేషనల్ మ్యూజియం భారతదేశంలోని అతిపెద్ద మ్యూజియంలలో ఒకటి. ఇది సింధు లోయ నాగరికత, మొఘల్ పెయింటింగ్‌లు, పురాతన మాన్యుస్క్రిప్ట్‌లతో సహా దేశవ్యాప్తంగా ఉన్న కళాఖండాల అమూల్యమైన సేకరణను కలిగి ఉంది.

### ఛత్రపతి శివాజీ మహారాజ్ మ్యూజియం

ఛత్రపతి శివాజీ మహారాజ్ మ్యూజియం ఆఫ్ ఆర్కిటెక్చర్ ముంబైని గతంలో ప్రిన్స్ ఆఫ్ వేల్స్ మ్యూజియం అని పిలిచేవారు. ఈ మ్యూజియం ముంబైలోని ఫోర్ట్ ప్రాంతంలో ఉంది. ఇది నగరంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రదేశాలలో ఒకటి. ఇది పురాతన శిల్పాలు, అలంకార వస్తువులు, ఆభరణాలు, అరుదైన నాణేలతో సహా ఆకట్టుకునే కళాఖండాల సేకరణను కలిగి ఉంది. మ్యూజియంలోని ఇండో-సార్సెనిక్ ఆర్కిటెక్చర్ ఒక అద్భుతమైన ఆకర్షణ. ఈ మ్యూజియంలోని అనేక వస్తువులను టాటా విరాళంగా ఇచ్చారు.

### సాలార్ జంగ్ మ్యూజియం

సాలార్ జంగ్ మ్యూజియం, హైదరాబాద్ భారతదేశంలోని మూడు జాతీయ మ్యూజియాలలో హైదరాబాద్ సాలార్ జంగ్ ఒకటి. సాలార్ జంగ్ III అని కూడా పిలువబడే మీర్ యూసుఫ్ అలీ ఖాన్ సేకరించిన వస్తువుల ఎంపికకు ఈ మ్యూజియం ప్రసిద్ధి చెందింది. ఈ మ్యూజియంలో భారతీయ కళలు, యూరోపియన్ పెయింటింగ్స్, మిడిల్ ఈస్టర్న్ పురాతన వస్తువులు, ఓరియంటల్ కళాఖండాలు వంటి అనేక వస్తువులను ప్రదర్శిస్తారు.

### విక్టోరియా మ్యూజియం

విక్టోరియా మెమోరియల్, కోల్‌కతా క్వీన్ విక్టోరియాకు అంకితం చేయబడింది. ఈ వాస్తు మ్యూజియం ఆర్కిటెక్చర్‌కు చక్కటి ఉదాహరణ. విక్టోరియా మెమోరియల్ విక్టోరియా రాణికి అంకితం చేయబడింది. ఈ మ్యూజియంలో బ్రిటిష్ కాలం నాటి కళాఖండాలు, పెయింటింగ్‌లు, మాన్యుస్క్రిప్ట్‌ల విస్తృతమైన సేకరణను భద్రపరిచారు. ఇది భారతదేశంపై బ్రిటిష్ పాలన చరిత్రకు ఒక సంగ్రహావలోకనం ఇస్తుంది.

### చెన్నై గవర్నమెంట్ మ్యూజియం

గవర్నమెంట్ మ్యూజియం, చెన్నై చెన్నైలోని ప్రభుత్వ మ్యూజియం పురావస్తు శాస్త్రం, నామిస్మాటిక్స్, సహజ చరిత్ర అద్భుతమైన సేకరణలకు ప్రసిద్ధి చెందింది. కాంస్య గ్యాలరీలో చోళ సామ్రాజ్యం నుండి కాంస్యాలు ఉన్నాయి.

### సిటీ ప్యాలెస్ మ్యూజియం

జైపూర్ సిటీ ప్యాలెస్ మ్యూజియం, జైపూర్ జైపూర్ సిటీ ప్యాలెస్ సిటీ ప్యాలెస్ కాంప్లెక్స్‌లో ఉంది. ఈ మ్యూజియం రాజస్థాన్ రాచరిక వారసత్వాన్ని వివరిస్తుంది. మ్యూజియం ప్రదర్శనలలో రాజ దుస్తులు, మాన్యుస్క్రిప్ట్‌లు, ఆయుధాలు, మొఘల్, రాజస్థానీ సంస్కృతి సంగ్రహావలోకనం 9 ఉన్నాయి.

### కాలికో మ్యూజియం

కాలికో మ్యూజియం ఆఫ్ టెక్స్‌టైల్స్, అహ్మదాబాద్ భారతీయ వస్త్రాల సమగ్ర సేకరణకు ప్రసిద్ధి చెందింది. అహ్మదాబాద్‌లోని కాలికో మ్యూజియం దేశం గొప్ప వస్త్ర వారసత్వాన్ని ప్రదర్శిస్తుంది. వివిధ ప్రాంతాలు, యుగాల నుండి సాంప్రదాయ వస్త్రాలు, ఎంబ్రాయిడరీలు, చేతిపనులను ప్రదర్శిస్తుంది.

### నేషనల్ రైల్వే మ్యూజియం

నేషనల్ రైల్వే మ్యూజియం, న్యూఢిల్లీ భారతీయ రైల్వేల చరిత్రలో ఒక చారిత్రాత్మక ప్రయాణాన్ని న్యూఢిల్లీలోని నేషనల్ రైల్వే మ్యూజియంలో చూడవచ్చు. రైల్వే నిర్మాణ చరిత్రను ప్రదర్శించే వివిధ లోకోమోటివ్‌లు, క్యారేజీలు, కోచ్‌లు ఇక్కడ ఉన్నాయి. ఈ మ్యూజియం భారతదేశ రైల్వే వారసత్వం మనోహరమైన స్వభావాన్ని ప్రదర్శిస్తుంది. ఇక్కడ మీరు మీ టాయ్ రైలులో ప్రయాణించవచ్చు. ఈ రైల్వే మ్యూజియం ఒక ప్రత్యేకమైన, మనోహరమైన అనుభూతిని అందిస్తుంది.

### డా. భౌ దాజీ లాడ్ మ్యూజియం

డా. భౌ దాజీ లాడ్ మ్యూజియం, బైకుల్లా, ముంబై ముంబైలోని బైకుల్లాలో ఉన్న ఈ మ్యూజియాన్ని గతంలో విక్టోరియా, ఆల్బర్ట్ మ్యూజియం అని పిలిచేవారు. ముంబై నగరం సాంస్కృతిక వారసత్వం, చరిత్ర చక్కటి, అలంకార కళలు, చేతిపనుల ద్వారా, చారిత్రక ఛాయాచిత్రాలు, నమూనాల ద్వారా ఇక్కడ భద్రపర్చారు.

## ఐస్ మ్యాజిక్ ప్రో గ్లాస్ డోర్ రిఫ్రిజిరేటర్ శ్రేణిని

# విడుదల చేసిన వర్ల్‌పూల్

ముందడుగు హైదరాబాద్:

అత్యుత్తమ సౌందర్యం, హస్తకళల సమ్మేళనంతో నూతన శ్రేణి సింగిల్ డోర్ రిఫ్రిజిరేటరు-ఐస్ మ్యాజిక్ ప్రో గ్లాస్ డోర్‌ను వర్ల్‌పూల్ కార్పొరేషన్ అనుబంధ సంస్థ వర్ల్‌పూల్ ఆఫ్ ఇండియా విడుదల చేసింది. భారతీయుల నివాసాలలో ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న ఆధునికీకరణతో అనుసంధానం చేసేందుకు ఉత్పత్తి సమర్పణ స్టైలిష్‌గా, సమకాలీనంగా ఉండాలని వర్ల్‌పూల్ విశ్వసిస్తోంది. గ్లాస్ డోర్‌పై "మునుపెన్నడూ చూడని" నమూనాలతో నూతన శ్రేణి అధునాతనతను, భారతీయ నివాసాలకు అందమైన లేయర్‌ను జోడించడం ద్వారా లివింగ్ స్పేస్‌ను మరింత సౌందర్యంగా చేస్తుంది. కొత్తగా విడుదల చేస్తున్న ఈ ఉత్పత్తుల గురించి వర్ల్‌పూల్ ఆఫ్ ఇండియా మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు కుమార్ గౌరవ్ సింగ్ మాట్లాడుతూ, "వర్ల్‌పూల్‌లో, మా ఉత్పత్తులు మా వినియోగదారుల మొత్తం జీవనశైలిని స్టైల్, ఫంక్షనాలిటీ మరియు మన్నిక ద్వారా మెరుగుపరచడంలో సహాయపడతాయని మేము విశ్వసిస్తున్నాం అన్నారు.



ముందడుగు
శనివారం,
20-7-2024,
హైదరాబాద్

### నొప్పి లేకుండా ప్రశాంతంగా

# చనిపోవచ్చు

### కొత్త మిషన్ కనిపెట్టిన స్విట్జర్లాండ్ ప్రభుత్వం



ముందడుగు స్విట్జర్లాండ్:
ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారి కోసం, నొప్పి లేకుండా చావాలని కోరుకునేవారి కోసం స్విట్జర్లాండ్ సైంటిస్టులు ఓ మిషన్‌ను కనిపెట్టగా దానికి చట్టబద్ధతను స్విట్జర్లాండ్ ప్రభుత్వం కల్పించింది. ఎవరైనా మానసికంగా కుంగిపోయినప్పుడు ఆత్మహత్య చేసుకోవాలని భావిస్తారు. ఆత్మహత్య కోసం ఉరి వేసుకోవడం లేదా కాల్వలో దూకడం లేదా రైలుపట్టాల కింద పడటం లాంటి చర్యలకు పాల్పడతారు. అయితే ఇకపై అలాంటి చర్యలకు పాల్పడకుండా నొప్పి లేకుండా నిమిషంలోనే చనిపోయేలా స్విట్జర్లాండ్‌లోని సైంటిస్టులు ఓ పరికరాన్ని కనిపెట్టారు.

కోరుకున్న సమయానికి నొప్పి లేకుండా చనిపోయేందుకు ఈ మిషన్ సహకరిస్తుందని స్విట్లర్లాండ్ సైంటిస్టులు చెప్తున్నారు. ఈ మిషన్‌కు సార్కో అని పేరు కూడా పెట్టారు. ఎవరైనా చనిపోవాలని కోరుకునేవారు శవపేటిక తరహాలో ఉండే సార్కో మిషన్‌లో పడుకుంటే చాలు. నిమిషం గడవక ముందే చనిపోతారు. ఈ మిషన్‌లో పడుకోగానే... శరీరంలో ఆక్సిజన్ స్థాయి తగ్గిపోవడంతో వెంటనే మరణిస్తారు.

ప్రాణాలను నిమిషంలోనే తీయగల ఈ యంత్రాన్ని వినియోగదారులు నచ్చిన ప్రదేశానికి తీసుకెళ్లవచ్చు. అయితే ఈ యంత్రం కనిపెట్టడంపై విమర్శలు రాగా... ప్రభుత్వం రంగంలోకి దిగి చట్టబద్ధతను కల్పించింది. కాగా రోగాల బారిన పడిన వారు చనిపోవాలంటే స్విట్జర్లాండ్‌లో ముందుగా ప్రభుత్వం నుంచి చాలా అనుమతులను తీసుకోవాలి. అసిస్టెడ్ డైయింగ్ కోసం డాక్టర్లను ఒప్పించి లిక్విడ్ సోడియం పెంటోబార్బిటల్‌ను తీసుకోవాలి. కానీ సూసైడ్ మిషన్‌తో అలాంటి ఇబ్బందులేవీ లేకుండా ప్రశాంతంగా చనిపోవచ్చు.

# కేవలం 21 రోజుల్లో బరువు తగ్గిన మాధవన్

### బరువు తగ్గడానికి మాధవన్ చేసిన సూత్రాలు





ముందడుగు జాతీయం
సినిమా, అందులోని పాత్రల కోసం నటీనటులు వారి శరీరాన్ని కూడా పాత్రకు తగ్గట్టు మార్చుకుంటున్నారు. ఇటీవల కాలంలో నటుడు మాధవన్ ఎంచుకునే కథలు, పాత్రలు వైవిధ్యంగా ఉంటున్నాయి. ఆయన స్వీయ దర్శకత్వంలో వచ్చిన 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని పొందిన సంగతి తెలిసిందే. ఇందులో వయసు మళ్లిన నంబి పాత్ర కోసం పొట్ట కూడా పెంచారు. మళ్లీ ఫిట్‌నెస్‌తో కనపడటానికి తాను పాటించిన డైట్ వివరాలను తాజాగా మాధవన్ పంచుకున్నారు. ఎలాంటి కఠిన వ్యాయామాలు లేకుండా కేవలం సాధారణ ఆహారం, వాకింగ్‌తోనే బరువు తగ్గినట్లు తెలిపారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఇంతకీ మాధవన్ చెప్పిన డైట్ ఏంటో తెలుసా?

### మంచి నిద్ర ప్రధాన కారణం

బరువు తగ్గడానికి ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ పాటించా. ఆహారాన్ని తినేటప్పుడు 45-60 సార్లు నమిలి తినేవాడిని. చివరి మీల్‌ను సాయంత్రం 6.45 గంటలకే ముగిసేది. కేవలం వండిన ఆహారాన్నే మాత్రమే తీసుకునేవాడిని. పచ్చి ఆహారం ఏది తీసుకోవాలనుకున్నా మధ్యాహ్నం 3 గంటల కన్నా ముందే ముగించేవాడిని. రాత్రి వీలైనంత త్వరగా నిద్ర పోవడమే కాదు, కలత నిద్ర లేకుండా చూసుకునేవాడిని. ఉదయాన్నే ఎక్కువ సమయం నడవటానికి కేటాయించాను. రాత్రి పడుకునే 90 నిమిషాల ముందే సెల్, టీవీ చూడటం మానేశా. ద్రవాహారం ఎక్కువగా తీసుకునేవాడిని. మరీ ముఖ్యంగా ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలను భాగం చేయడం ద్వారా శరీరంలోని మెటబాలిజం పెరిగి ఆరోగ్యవంతంగా బరువు తగ్గడానికి ఉపయోగపడింది. ప్రాసెస్ చేసిన ఆహారాన్ని అస్సలు తీసుకోలేదు అని తన 21 రోజుల డైట్ గురించి చెప్పారు. నంబి పాత్ర కోసం మాధవన్ మారిన తీరును ఆయన అభిమానులు మెచ్చుకుంటున్నారు.

'ఉపవాసం చేయడం మంచిదే అయినా, తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే ఇబ్బందులు వస్తాయి. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలి' అని ఒక నెటిజన్ అభిప్రాయపడగా, 'నిరంతరం ఆకలితో ఉండటం నిజంగా కఠినమైన చర్యే. అందరికీ అది సాధ్యం కాకపోవచ్చు', 'సరైన సమయానికి సరైన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చు' అని మరో నెటిజన్ అభిప్రాయపడ్డాడు.

# నగరంలో అడుగుపెట్టిన వి లిటిల్ పీడియాట్రిక్ డెంటల్ క్లీనిక్

ముందడుగు హైదరాబాద్:
పిల్లలు వారి తల్లిదండ్రుల జీవితాల్లో చిరునవ్వులు చిందించే వి లిటిల్ పీడియాట్రిక్ డెంటల్ క్లీనిక్ తన సేవలను హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తమ శాఖను ప్రారంభించారు. ఈ వీ లిటిల్ డెంటల్ క్లినిక్‌ను భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ సమక్షంలో ముఖ్య అతిథిగా హజరై ప్రారంభించారు. భారతదేశపు మొట్టమొదటి ప్రివెంటివ్ పీడియాట్రిక్ డెంటిస్ట్రీ న్యాయవాది డాక్టర్ షిఫా స్థాపించారు, ఈ బ్రాండ్ 2012 నుండి కోయంబత్తూర్, చెన్నై మరియు బెంగళూరులలో పనిచేస్తోంది. ఇప్పుడు తన శాఖను హైదరాబాద్‌కు విస్తరించింది.

సైనా నెహ్వాల్ మాట్లాడుతూ క్లినిక్ అందమైన వాతావరణం మరియు పిల్లల-స్నేహపూర్వక సౌకర్యాలు, ఆటలకు మంచి వాతావరణం ఉందన్నారు. యోగా మరియు ధ్యానం చేసే ప్రాంతాలను ప్రశంసించారు. నెహ్వాల్ తన నోటి పరిశుభ్రతపై తీసుకునే చర్యల గురించి వివరించారు. రోజుకు రెండుసార్లు బ్రష్ చేయడం మంచి నిద్రకు దోహదపడటమే కాకుండా దంత సమస్యలను నివారించడంలో కూడా సహాయపడుతుందని అన్నారు. క్లినిక్ కోసం ఆమె ప్రశంసలతో పాటు, నెహ్వాల్ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో బ్యాడ్మింటన్ ఆడిన తీరుపై తన అనుభవాన్ని పంచుకున్నారు.

